క్లుప్తంగా

స్టేషన్ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డోన్ డీఎస్పీ

బేతంచెర్ల: స్థానిక పోలీస్ స్టేషన్‌ను డోన్ డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలో నమోదైన కేసులపై ఆరా తీశారు. వివిధ రకాల కేసులు నమోదుచేసేటప్పుడు అనుసరించాల్సిన విధానాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి సూచనలిచ్చారు. కేసుల దర్యాప్తులో పాటించాల్సిన మెలకువలను వివరించారు. ఆయన వెంట సీఐ ప్రితంరెడ్డి, ఎస్ఐ శివశంకర్ నాయక్, ఏఎస్ఐ లింగమయ్య ఉన్నారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం

బేతంచెర్ల: పట్టణంలోని పూదోట ఆశ్రమంలో భాద్రపద పౌర్ణమిని పురస్కరించుకుని భక్తులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని శుక్రవారం నిర్వహించారు. అర్చకుడు ప్రభాకరయ్య ఆధ్వర్యంలో రమ సత్యనారాయణ స్వామికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనతో పాటు సత్యనారాయణ స్వామి వ్రత మహిమను వివరించి, మహామంగళహరతి గావించారు.

పలక, నోటు పుస్తకాలు, పెన్నుల పంపిణీ

బనగానపల్లె రూరల్: మండల పరిధిలోని బీరవోలు ఎస్టీ కాలనీ ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం వీరబ్రహ్మేంద్రస్వామి భక్త మండలి సభ్యులు పలక, పెన్నులు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జేఎస్ఎస్ బ్రహ్మానంద ఆచారి, హెచ్ఎం వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు రాజేశ్వరి, సుబ్బమ్మ,దేవమ్మ, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

100 లీటర్ల నాటుసారా పట్టివేత

ప్యాపిలి: మండల పరిధిలోని బావిపల్లి గ్రామ శివారు ప్రాంతంలో శుక్రవారం 100 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు డోన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ భీమలింగ తెలిపారు. బావిపల్లి గ్రామానికి చెందిన ఈడిగ సుంకన్నను అరెస్టు చేసి అతని వద్ద ఉన్న 100 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. సుంకన్నకు నాటుసారా సరఫరా చేసిన సీతమ్మతండాకు చెందిన ముడావత్ రాముడునాయక్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రక్త దానం

డోన్ టౌన్: పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువతి షంషాద్‌కు బి.నెగిటివ్ రక్తం అవసరం కావడంతో ఆమె కుటుంబ సభ్యులు వాట్సాప్ గ్రూపుల్లో పోస్టింగ్ పెట్టారు. స్పందించిన ద్రోణాచలం సేవా సమితి సైనికుడు రామ్మోహన్ తన బీ.నెగిటివ్ రక్తాన్ని దానం చేశాడు. ఇందుకు సేవా సమితి సభ్యులు సేవా సమితి సైనికులు షాదిఖానా రాజు, గురుస్వామి, షబ్బీర్‌తో పాటు బాధిత మహిళ బంధువులు.. రామ్మోహన్‌కు ధన్యవాదాలు తెలిపారు. కాగా ప్రస్తుతం తాను 19వ సారి రక్తం దానం చేసినట్లు రామ్మోహన్ తెలిపారు.

పరామర్శ

సంజామల: మండల పరిధిలోని అక్కంపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కప్పెట వెంకటేశ్వర్ రెడ్డి (34) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మృతుని కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు. అలాగే పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి గుండం ప్రకాష్ రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ మల్కిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, అవుకు జెడ్పీటీసీ చల్లా శ్రీలక్ష్మి తదితరులు వెంకటేశ్వర్‌రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేడు నీటి సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: గాజులదిన్నె నుంచి వచ్చే పైపులైన్ లీకేజ్ కారణంగా శనివారం పట్టణంలో తాగు నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పేరంటాలమ్మ గుడి వద్ద ఉన్న ఫిల్టర్ హౌస్‌కు నీరు వచ్చే ప్రధాన పైపులైన్‌కు కృష్ణగిరి మండలం చిట్యాల వద్ద, డోన్ మండలం అబ్బిరెడ్డిపల్లె గ్రామ సమీపంలో లీకేజ్ ఏర్పడిందన్నారు. నీటి సరఫరా నిలిపేసి మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. ఆదివారం నుంచి యథావిధిగా నీటి సరఫరాను పునరుద్ధరిస్తామన్నారు. పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

కొలిమిగుండ్లలో భారీ వర్షం

కొలిమిగుండ్ల: కొలిమిగుండ్లతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. మండలంలో 32.6 మి.మీ వర్షపాతం నమోదైంది. సెప్టెంబర్‌లో 122.6 మి.మీ సాధారణ వర్షపాతం కాగా 133.4 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇటీవల ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షానికి కొలిమిగుండ్ల-నాయినపల్లె గ్రామాల మధ్యనున్న సద్దల వెంగన్న చెరువు పూర్తి స్థాయిలో నిండిపోయింది. తాజాగా కురిసిన వర్షానికి అలుగు ఎక్కి నీళ్లు ప్రవహించడంతో కొలిమిగుండ్లలోని వాగుల్లోకి నీరు చేరాయి. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు వర్షం ఊరట నిచ్చింది. రబీలో ప్రధానంగా శనగ సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

అట్టహాసంగా జగనన్న ఆరోగ్య సురక్ష

- ఇంటింటికి తిరుగుతూ వ్యాధి గ్రస్తుల సర్వే చేస్తున్న ఆరోగ్య సిబ్బంది
- చిన్నచిన్న వ్యాధులకు వైద్యం, మాత్రల పంపిణీ
- అవసరమైన వారికి ప్రత్యేక డాక్టర్‌తో వైద్యం చేయించుకునేందుకు టోకెన్ల పంపిణీ

జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నియోజకవర్గంలో అట్టహాసంగా సాగుతోంది. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి వ్యాధి గ్రస్తుల వివరాలు సేకరిస్తున్నారు. బీపీ, షుగర్ తదితర చిన్నచిన్న వ్యాధులకు వైద్యం అందించి, మాత్రలను పంపిణీ చేస్తున్నారు. ప్రత్యేక వైద్యం అవసరమైన వారికి త్వరలో నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్యం చేయించుకునేందుకు టోకెన్లు అందజేస్తున్నారు. – బనగానపల్లె



టోకెన్ అందిస్తున్న టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శివశంకరుడు



మాట్లాడుతున్న నగర పంచాయతీ చైర్మన్, కమిషనర్



కోవెలకుంట్ల: రెండవ గ్రామ సచివాలయ పరిధిలో మహిళకు బీపీ చెక్ చేస్తున్న డాక్టర్

బనగానపల్లె రూరల్: పట్టణంలోని సచివాలయం -3 హెల్త్‌క్లినిక్‌లో జరుగుతున్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి పరిశీలించారు. వైద్యాధికారుల పర్యవేక్షణలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ప్రతి ఇంటి వద్దకు వెళ్లి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీస్తున్నారని, ప్రజలు కూడా సహకరించాలని తిరుపాల్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో సీహెచ్ఓ మంజుల, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని తుమ్మలపెంటలో ఏఎన్ఎం నాగలక్ష్మి, ఆశా కార్యకర్తలు ఇంటింటి సర్వే నిర్వహించారు. అలాగే ఎంపీడీఓ ప్రసాద్ రెడ్డి తుమ్మలపెంటకు చేరుకొని విలేజ్ హెల్త్ క్లినిక్ ఆవరణలో ఏర్పాటు చేయనున్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్ ఏర్పాట్లను పరిశీలించి, వివిధ అంశాలపై అధికారులతో చర్చించారు. ఆయన వెంట ఈఓఆర్డీ శ్రీహరి, పంచాయితీ కార్యదర్శి భార్గవి లత, ఉపసర్పంచ్ శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.



తుమ్మలపెంటలో వృద్ధుడికి పరీక్షలు నిర్వహిస్తున్న ఏఎన్ఎం నాగలక్ష్మి

బేతంచెర్ల: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై పట్టణంలోని 1, 2, 6 గ్రామ సచివాలయాల సిబ్బంది, ఏఎన్ఎంలు, వలంటీర్లతో నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, కమిషనర్ రమేష్‌బాబు సమావేశం నిర్వహిచారు. వైద్య శిబిరాను సద్వినియోగం చేసుకుని సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉండేలా ప్రజలను చైతన్యం చేయాలని వారు సూచించారు. సమావేశంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, వార్డు కౌన్సిలర్లు చింతల నాగిరెడ్డి, షేక్ ముబీనా, మధు పాల్గొన్నారు.



బేతంచెర్ల పట్టణంలో వృద్ధురాలికి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది



ఆరోగ్య సిబ్బందితో కలిసి సురక్ష కరపత్రాలను చూపుతున్న తిరుపాల్‌రెడ్డి

- బేతంచెర్ల పట్టణంలోని 19వ అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్ వైజర్ రాధ ఆధ్వర్యంలో జరుగుతున్న అంగన్‌వాడీ కార్యకర్తల సెక్టార్ సమావేశాన్ని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, కమిషనర్ రమేష్ బాబు పరిశీలించారు. గర్భిణులు, చిన్నారులకు సక్రమంగా పౌష్టికాహారం అందించాలని సూచించారు.
- బేతంచెర్ల పట్టణంతో పాటు పలు గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను ఆరోగ్య సిబ్బంది చేపట్టారు.
- ప్యాపిలి: జలదుర్గం, ప్యాపిలి పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో జగన్న ఆరోగ్య సురక్ష సర్వే చురుగ్గా సాగుతోంది. శుక్రవారం మెట్టుపల్లి గ్రామంలో వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి ప్రజల ఆరోగ్యాన్ని పరీక్షించారు.

పట్టణాభివృద్ధికి సమగ్ర ప్రణాళిక



మాట్లాడుతున్న చైర్మన్ రాజేష్

డోన్: పట్టణాభివృద్ధికి సమగ్ర ప్రణాళికతో ముందుకెళ్తున్నట్లు మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో శుక్రవారం కమిషనర్ వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతకుముందు 8 అంశాలను సభలో కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదించారు. వంద పడకల ప్రభుత్వాసుపత్రి నిర్మాణ పనులు ముగింపు దశలో ఉన్నందున మునిసిపాలిటీ పైపు లైన్ ద్వారా నీటి వసతి కల్పించడానికి సభ ఏకగ్రీవంగా తీర్మానించిందన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల కింద ప్రతి వార్డులో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. సమావేశంలో మునిసిపల్ డీఈ రసూల్, ఏఈ సురేష్, హౌసింగ్ ఏఈలు నాగ భూషణం, ఇతేంద్ర పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

కోవెలకుంట్ల: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరి, మిరప పంటల్లో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు సుధాకర్, రమణయ్య సూచించారు. శుక్రవారం మండలంలోని అమడాల, గుళ్లదూర్తి గ్రామాల్లో వరి, మిరప పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మిరప పంటను తామర పురుగు, తెల్లదోమ, వైరస్ వంటి చీడ పీడలు ఆశించాయని నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఎకరాకు 40 పసుపు, 30 నీలి, 30 తెలుపురంగు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని వివరించారు. వారి వెంట మండల వ్యవసాయాధికారి నిరంజన్ ఉన్నారు.



అమడాల వద్ద మిరప పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

విద్యార్థులకు అభినందన

ప్యాపిలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు త్రోబాల్ జిల్లా జట్టులో స్థానం లభించింది. ఈ నెల 28 న కర్నూలు అవుట్ డోర్ స్టేడియంలో జరిగిన స్కూల్ గేమ్స్‌లో జూనియర్ కళాశాల విద్యార్థులు రాకేశ్, నరసింహ పాల్గొని ప్రతిభ చాటి జిల్లా స్థాయి జట్టుకు ఎంపికయ్యారు. వీరిని శుక్రవారం ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం, లెక్చరర్లు అభినందించారు. త్వరలో జరుగనున్న అండర్ 17 రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీల్లో తమ విద్యార్థులు పాల్గొంటారని ప్రిన్సిపాల్ తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు



మల్లెంపల్లె రామ చంద్రుడు (డోన్)



బొర్రా మల్లికార్జున రెడ్డి(ప్యాపిలి)



కె.తిరుమలేశ్వర్ రెడ్డి(బేతంచెర్ల)



కురుకుందు హరి (డోన్ పట్టణం)



ఎం.ఖాజా హుసేన్ (బేతంచెర్ల పట్టణం)

సేవలకు గుర్తింపు

- వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుల నియామకం

డోన్/ప్యాపిలి/బేతంచెర్ల: కష్టపడి పనిచేసిన కార్యకర్తలను వైఎస్సార్‌సీపీ గుర్తించింది. పార్టీ అభివృద్ధికి కృషిచేసిన వారికి పదవులు కట్టబెట్టింది. మండల, పట్టణ అధ్యక్షులను నియమిస్తూ శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. డోన్ మండల అధ్యక్షుడిగా మల్లెంపల్లె రామచంద్రుడు, ప్యాపిలి మండల అధ్యక్షుడిగా బొర్రా మల్లికార్జునరెడ్డి, బేతంచెర్ల మండల అధ్యక్షుడిగా కె.తిరుమలేశ్వర్‌రెడ్డిలను నియమించింది. అలాగే డోన్ పట్టణ అధ్యక్షుడిగా కురుకుందు హరిని, బేతంచెర్ల పట్టణ అధ్యక్షుడిగా ఎం.ఖాజా హుసేన్‌ను నియమించినట్లు ప్రకటనలో పేర్కొంది. నూతన అధ్యక్షులకు పలువురు మండల నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

బనగానపల్లె నియోజకవర్గం..

బనగానపల్లె రూరల్/కోవెలకుంట్ల/సంజామల/కొలిమిగుండ్ల/అవుకు: నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషిచేసిన పలువురిని పదవులు వరించాయి. బనగానపల్లె మండల అధ్యక్షుడిగా సన్నల జనార్దన్‌రెడ్డి, కోవెలకుంట్ల మండల అధ్యక్షుడిగా బీవీ నాగార్జునరెడ్డి, సంజామల మండల అధ్యక్షుడుగా మల్కిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, కొలిమిగుండ్ల మండల అధ్యక్షుడిగా అంబటి గుర్విరెడ్డి, అవుకు మండల అధ్యక్షుడిగా కాటసాని తిరుపాల్ రెడ్డిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.



ఎస్ జనార్దన్‌రెడ్డి (బనగానపల్లె)



బీవీ నాగార్జునరెడ్డి (కోవెలకుంట్ల)



వెంకట సుబ్బారెడ్డి (సంజామల)



అంబటి గుర్విరెడ్డి (కొలిమిగుండ్ల)



కాటసాని తిరుపాల్ రెడ్డి(అవుకు)

పగటి వేళల్లోనే 9 గంటల విద్యుత్ సరఫరా

- నెలన్నరలోపే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్
- ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలి
- కోవెలకుంట్ల మండల మీట్‌లో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

కోవెలకుంట్ల: వ్యవసాయ రంగానికి పగటి వేళల్లోనే తొమ్మిది గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలమీట్‌కు ఎమ్మెల్యేతో పాటు ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కర్రా గిరిజా హర్షవర్ధన్‌రెడ్డి హాజరయ్యారు. సర్వసభ్య సమావేశంలో విద్యుత్ శాఖపై చర్చకు రాగా కోవెలకుంట్ల పట్టణంలో చిన్నపాటి గాలి, వర్షానికే విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నారని, రాత్రి వేళల్లో వృద్ధులు, చిన్న పిల్లలు కరెంట్ లేకపోవడంతో ఉక్కపోతతో అల్లాడుతున్నారని మండల కో ఆప్షన్ మెంబర్ దిల్కా‌బాషా, మండల ఉపాధ్యక్షురాలు షాజహాన్ సభ దృష్టికి తెచ్చారు. సంతపేటలో విద్యుత్‌తీగలు కిందకు వేలాడుతుండటంతో విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని సభలో ప్రస్తావించారు. ట్రాన్స్‌కో ఏఈ రామమోహన్ మాట్లాడుతూ వర్షాకాలం కావడం వల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయమేర్పుడుతోందని, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్నామన్నారు. సంతపేటలో విద్యుత్‌లైన్ మార్చేందుకు స్థానికులు కొందరు అడ్డు తగులుతున్నారన్నారు. ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ విద్యుత్‌సమస్యలు తలెత్తినప్పుడు ప్రజలు అధికారులకు సహకరించాలని సూచించారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకుంటే మూడేళ్ల తర్వాత ఇచ్చేవారని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నెలన్నరలోపే విద్యుత్ కనెక్షన్ అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం చేపట్టిన సమయంలో ఆయా గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయని, పలు ప్రాంతాల్లో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయని ప్రజలు తమ దృష్టికి తెచ్చారన్నారు. ఆ సమస్యలన్నింటిని త్వరితగతిన పరిష్కరించి నివేదిక ఇవ్వాలని ట్రాన్స్‌కో అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. తాగునీటి సరఫరాపై చర్చకు రాగా చిన్నకొప్పెర్ల, రేవనూరు, కోవెలకుంట్ల, కలుగొట్ల, జోళదరాశి జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా కొనసాగుతున్నాయని, నీటి సరఫరాకు పైప్‌లైన్ వేయకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని ఆయా గ్రామాల సర్పంచ్‌లు సభ దృష్టికి తెచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరీష్ మాట్లాడుతూ పైప్‌లైన్ నిర్మాణానికి నిధుల విడుదలకు ప్రతిపాదనలు పంపామన్నారు. గ్రామాల్లో జరుగుతున్న భూముల రీసర్వేకు కొన్ని సమస్యలు అడ్డంగా ఉన్నాయని సభ్యులు ప్రస్తావించగా ఎమ్మెల్యే జోక్యం చేసుకుని బ్రిటీష్ కాలంలో రీసర్వే జరిగిందని, ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తిరిగి రీసర్వే చేపట్టిందన్నారు. రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని భూ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న గ్రామసచివాలయాలు, ఆర్‌బీకేల నిర్మాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలో భారీ వర్షాలు కురవకపోవడంతో శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం తక్కువగా ఉందన్నారు. గోరుకల్లు, అవుకు రిజర్వాయర్లలో నీరు పుష్కలంగా ఉంటే ఎస్సార్బీసీకి నీరు సమృద్ధిగా చేరుతుందన్నారు. సాగునీటి పరిస్థితుల దృష్ట్యా రైతులు ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, తహసీల్దార్ పుష్పకుమారి, ఎంపీడీఓ సయ్యదున్నీసా, ఎంఈఓ వెంకట్రామిరెడ్డి, మండల వ్యవసాయాధికారి నిరంజన్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పాల్గొన్నారు.

నేడు మెగా జాబ్ మేళా

బనగానపల్లె: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేయనున్న జాబ్ మేళాను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభించనున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. 21 కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూల ద్వారా తమకు కావాల్సిన వారిని ఎంపిక చేసుకుంటారన్నారు. నిరుద్యోగులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

చెంచుగూడెంకు తరలిన అధికారులు

కొలిమిగుండ్ల: జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సూచనల మేరకు బి.తాడిపత్రి సమీపంలోని చెంచుగూడెమును ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి, తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్ తదితరులు శుక్రవారం సందర్శించారు. అక్కడ నివస్తున్న 30 కుటుంబాలతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆరుగురికి ఆధార్ కార్డులు, 15 మందికి రేషన్ కార్డులు లేవని గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. బి.తాడిపత్రిలోని 80 కుటుంబాలతో పాటు చెంచులకు కలిపి ఒక్కరే వలంటీర్ ఉండటంతో మ్యాపింగ్ చేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎంపీడీఓ చెప్పారు. ఇక్కడ నెలకొన్న సమస్యలపై నివేదిక తయారు చేసి కలెక్టర్‌కు పంపుతామన్నారు. వారి వెంట సర్పంచ్ ఈశ్వరయ్య, వీఆర్వో ప్రభాకర్ ఉన్నారు.



వివరాలు సేకరిస్తున్న అధికారులు

నేటితో పంట నమోదు గడువు పూర్తి

బేతంచెర్ల: ఖరీఫ్‌లో సాగైన పంటలను నమోదు చేయించుకునేందుకు శనివారంతో గడువు ముగియనుందని మండల వ్యవసాయ అధికారి కిరణ్ కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఇంకా పంటలు నమోదు చేయించుకోని రైతులెవరైనా ఉంటే రైతు భరోసా కేంద్రంలో అగ్రికల్చర్ అసిస్టెంట్స్‌ను సంప్రదించాలన్నారు.

- **డోన్ టౌన్:** ఈ క్రాప్ బుకింగ్‌కు శనివారం చివరి రోజు అని మండల వ్యవసాయ అధికారి అబ్దుల్‌షఫీ శుక్రవారం తెలిపారు. ఇప్పటి వరకు పంటలు నమోదు చేయించుకోని రైతులు రైతు భరోసా కేంద్రాలల్లో వ్యవసాయ సహాయకుడిని కలవాలన్నారు.

నేడు సురక్ష వైద్య శిబిరం

బనగానపల్లె: మండలంలోని వెంకటాపురం గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ శివరామయ్య శుక్రవారం తెలిపారు. 11 రకాల జబ్బులకు డాక్టర్లు వైద్యం చేయనున్నారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గ్రామాల్లో శ్రమదానం

సంజామల: మండల పరిధిలోని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో శ్రమదానం చేపట్టాలని ఎంపీడీఓ నాగకుమార్ శుక్రవారం తెలిపారు. ప్రతి గ్రామంలోని ప్రజాప్రతినిధులు వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది ప్రజల సహకారంతో పంచాయతీ ముఖద్వారాలు, మార్కెట్ స్థలాలు, రోడ్డుకు ఇరువైపులా, పార్థనా మందిరాలు తదిదర ప్రాంతాల్లో శ్రమదానం చేయాలన్నారు.

సంక్షిప్తం

కోలుకోలేక వ్యక్తి మృతి

ప్యాపిలి: మండల పరిధిలోని అలేబాదుతండాకు చెందిన బాలునాయక్ (40) చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందాడు. ఈనెల 27న రామకృష్ణాపురం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలునాయక్, బాలనాయక్ గాయపడిన విషయం తెలిసిందే. కర్నూలులో చికిత్స పొందుతున్న బాలునాయక్ కోలుకోలేక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య బాలిబాయి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ప్రభుత్వ కళాశాల తనిఖీ

సంజామల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి సుజాత శుక్రవారం తనిఖీ చేశారు. నాడు నేడు పనులను పరిశీలించి పురోగతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీనువాస్ రెడ్డిని ఆదేశించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్యాపిలి: పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను డోన్ ఆర్డీఓ వెంకటరెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, ర్యాంపుల ఏర్పాటు తదితర సౌకర్యాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేయాలని తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మను ఆదేశించారు.

బహుమతుల పంపిణీ

బనగానపల్లె రూరల్: మిలాదున్ నబీ వేడుకలను పురస్కరించుకుని ఈ నెల 24న జమాతే ఇస్లామీ హింద్ బనగానపల్లె శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు శుక్రవారం ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. స్థానిక జమాతే ఇస్లామీ హింద్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షులు ఎంఎం అలీబేగ్, వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ నాయకులు, ఎంపీటీసీ మాజీ సభ్యులు అబ్దుల్ ఫైజ్, ఖాన్, రైస్ మిల్లు యజమాని ఇర్షాన్‌ఖాన్, డాల్ఫిన్ స్కూల్ కరస్పాండెంట్ సికిందర్ పాల్గొన్నారు.